# తల్లి పక్షి

''దివ్యా! నేను వెళుతున్నాను... తలుపేసుకుని కూర్చుని చదువుకో!'' చెప్పులు వేసుకుని హ్యాండ్ బాగ్ భుజానికి తగిలించుకుంటూ చెప్పింది రమణి.

దివ్య మాట్లాడలేదు... ''ఊ'' అనలేదు ''ఆ'' అనలేదు నిశ్శబ్దంగా టి.వి. స్క్రీన్ మీద కదుల్తోన్న రంగు రంగుల బొమ్మల్ని చూస్తోంది.

బూటు లేసులు ముడి వేసుకుంటున్న చరణ్ ఇద్దర్నీ ఓరకంట గమనిస్తూ నిశ్శబ్దంగా తనపని చేసుకుపోతున్నాడు.

''మాట్లాడవేమే!'' కోపంగా అరిచింది రమణి. దివ్య నిశ్శబ్దంగా నిట్టూర్చింది. ఏం మాట్లాడాలి? అమ్మ ఈ సమయంలో బైటకెళ్ళటం తనకిష్టం లేదు... ఆ విషయం ఎలా చెప్పాలో? చెప్పేంత చనువు కానీ, సాహసం కానీ తనకు లేదు... విని అర్థం చేసుకునేంత ఓర్పు, విశాల హృదయం ఆవిడకీ లేదు. అందుకే తనకిష్టంలేని విషయాలపై మౌనం వహించడం అలవాటు చేసుకుంది దివ్య.

''దివ్యా తలుపేసుకో అమ్మా... ఓ గంటలో అన్నయ్య వస్తాడు. నీకేం భయం లేదు.'' మృదువుగా అన్నాడు చరణ్. దివ్య తలతిప్పి తండ్రికేసి చూసింది.

దీనంగా, నిస్సహాయంగా ఉన్న ఆ చూపులవైపు దృష్టి నిలపలేని చరణ్ బాధగా మొహం తిప్పేసుకున్నాడు. అతనికి తెలుసు దివ్య ఒంటరితనం ఫీలవుతుంది ఈ సమయంలో, అది కూడా ఆదివారం నాడు తల్లితండ్రీ తననొక్కదాన్ని వదిలేసి అలా వెళ్ళిపోవటం చాలా ఇబ్బందికరంగా, అయిష్టంగా ఉంది... కానీ తనంతకన్నా నిస్సహాయుడు.

చరణ్ తల తిప్పేసుకున్నాడు.

దీనికి గారాబం ఎక్కువైపోయింది. పలకరిస్తే జవాబు చెప్పకుండా అలా మూగి మొద్దులా కూర్చుంటుంది. పదండి వెళ్దాం'' దివ్యమీద చిరాకు పడుతూ బైటికి నడిచింది రమణి.

చరణ్ అయిష్టంగానే ఆమెని అనుసరించాడు.

దివ్య కళ్ళు టి.వి. మీద ఉన్నా, చెవులు రమణి చెప్పుల చప్పుడు మీదా, గేటు శబ్దం మీదా ఉన్నాయి. దూరమైపోతున్న చెప్పుల చప్పుడు గుండెను కోస్తున్నట్టనిపించింది. పరుగెత్తుకెళ్ళి 'అమ్మా! నువ్వెళ్ళొద్దు నాకు భయం వేస్తుంది. ఒంటరిగా ఉండలేను' అని ఆమెను చుట్టుకుపోయి వెళ్ళకుండా నిరోధించాలనిపించింది.

కానీ ఏం చేయలేని నిస్సహాయతతో గుండె కరిగి కన్నీరై స్రవిస్తోంటే అలాగే స్తబ్దుగా కూర్చుండిపోయింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. టి.వి.లో వాళ్ళేదో అంటున్నారు. ఆ డైలాగ్స్ ఆమె మెదడు రిసీవ్ చేసుకోలేకపోతోంది. మెదడంతా మొద్దుబారినట్టు చెవులు దిబ్బళ్ళేసినట్టు అనిపిస్తోంది. తనలోని చైతన్యం, ఉత్సాహం, ఆనందం అంతా రమణితో వెళ్ళిపోయినట్లు అనిపిస్తోంది.

అమ్మ!... అమ్మంటేనే ఎంత ఆప్యాయంగా, సన్నిహితంగా ఉండాలి! ఎందుకీ దూరం తామిద్దరి మధ్యా. మనసులో మాట అమ్మకు చెప్పాలంటే వీలే కుదరదు. గొంతులో ఏదో అడ్డుపడిన భావన. అమ్మతో మనసారా కబుర్లు చెప్పుకోవాలనిపిస్తుంది. జూనియర్ కాలేజీ కబుర్లు అమ్మాయిల అల్లరి, అబ్బాయిల ఆకతాయి వేషాలు, లెక్చరర్ల పక్షపాత వైఖరీ అన్నీ అమ్మతో పంచుకోవాలనిపిస్తుంది.

అమ్మ ఒళ్ళో కాస్సేపు పడుకోవాలని, అనవసరంగా అమ్మ దగ్గర గారాంచేసి, అన్నం తినకుండా మొరాయించి అమ్మ చేతి ముద్దలు తినాలనీ, అమ్మతో కలిసి అల్లరి చేస్తూ టి.వి. చూడాలనీ దొడ్లో జామచెట్టు మీద చేరి గోలచేసే కోతులను అమ్మతో కలిసి అల్లరి పెట్టాలని ఎన్నో... ఎన్నో కోరికలు, ఊహలు.

కానీ.. కానీ... ఉదయం లేచిన దగ్గర్నుంచీ రాత్రి పదకొండు దాకా అమ్మ బిజీ... బిజీ... బిజీ... హడావుడిగా వంటచేసి అటు పనిమనిషి మీదా ఇటు నాన్న మీదా, తనమీదా కేకలేస్తూ తొమ్మిదవగానే సోషల్ సర్వీస్‌కి

పరుగెడుతుంది. ఇంటికి ఎప్పుడొస్తుందో తెలీదు. సాయంకాలం క్లబ్బుకి మీటింగ్‌లకీ, సెమినార్‌లకీ... ఖాళీగా ఉండటమంటే ఏమిటో అమ్మకి తెలియదు. హాయిగా భర్తతో, పిల్లలతో కూర్చుని ఎంజాయ్ చేయాలని ఆవిడకు అన్పించదు. ఎందుకీ హడావుడి! ఎవరికోసమో ఆ పరుగులు.

దివ్యని తండ్రి దినచర్య అంతగా బాధించదు. తనని ఎవరూ పట్టించుకోకపోయినా హాయిగా ఫ్రెండ్స్‌తో సినిమాలకో, షికార్లకో తిరిగే అన్నయ్య ప్రవర్తనా బాధించదు. కాని అమ్మే అమ్మ ఒక్కతే తనకి దగ్గరగా ఉంటే చాలనిపిస్తుంది.

ఏదో వెలితి, కాలేజీ, ఇల్లు, చదువు, ఫ్రెండ్స్‌తో కూడా ఎక్కువగా కలవనివ్వదు అమ్మ చదువు డిస్టర్బ్ అవుతుందంటుంది.

ఎలా! తన మనసులో కలిగే సంతోషం, దుఃఖం, ఆనందం, విచారం, ఉద్వేగం, కోపం, రకరకాల అనుభూతుల్ని ఎవరితోనన్నా పంచుకోవాలంటే ఎవరున్నారు తనకి? దివ్యకి ఏడుపొచ్చింది.

టి.వి.లో ఏదో ప్రోగ్రాం వస్తోంది. దివ్య కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి. అలా వర్షించి.. వర్షించి ఎప్పటికో నిద్రపోయింది.

ఆటోమేటిక్ డోర్ తీసి లోపలికొచ్చిన చరణ్ సోఫాలో అస్తవ్యస్తంగా పడుకుని నిద్రపోతున్న దివ్యని చూడగానే కదిలిపోయాడు.

పిచ్చితల్లి. ఎలా నిద్రపోతుందో! అన్నం తిన్నదో లేదో? అతని వెనుకనే లోపలికొచ్చిన రమణి క్కూడా ఎలాగో అన్పించింది. గబగబా వెళ్ళి దివ్యని లేపింది. దివ్య లేవలేదు.

''పదకొండు కూడా కాలేదు. అప్పుడే నిద్రేవిటి? లే టి.వి. కూడా ఆఫ్ చేయలేదు. అలా పడి నిద్రపోతున్నావా?'' కోపంగా అరిచింది.

దివ్య లేవలేదు. పక్కకి ఒత్తిగిల్లి పడుకుంది.

''పోనీలే రమా! వదిలేయి. నిద్రొచ్చిందేమో! పడుకోనీ. లేపకు'' వారించాడు చరణ్.

''బాగుంది. చదువు లేదు. సంధ్య లేదు. ఇంట్లో ఎవరూ లేరు కదా! ఏ డిస్టర్బెన్స్ లేకుండా హాయిగా చదువుకోవచ్చుగా!''

చరణ్‌కి కోపం వచ్చింది రమణిమీద. అసలు ఎందుకెళ్ళినట్టు మీటింగ్‌కి. అక్కడ ఉద్ధరించింది కూడా ఏమీలేదు. ఈవిడ లేకపోతే మీటింగ్

ఆగిపోతుందా! బలవంతంగా తనని కూడా లాక్కెళ్ళింది.

పదహారేళ్ళ పిల్లని ఇంట్లో ఒంటరిగా వదిలేసి అంతా ఎవరిదారిన వాళ్ళెళ్ళిపోతే ఆ ఒంటరి తనాన్ని ఎలా భరిస్తుంది పసి హృదయం! పోనీ ఒకరోజా! ప్రతిరోజూ అంతే... ఏవన్నా అంటే గయ్యిమని లేస్తుంది.

''నేను వంటింటి కుందేలునా? ఇంట్లోనే పడుండాలా? నాకేం ఆశల్లేవా? ఆశయాల్లేవా? నాకేం సరదాలఖ్ఖర్లేదా? అంటూ.

తల్లిగా పిల్లల విషయంలో తన పర్సనల్ అటెన్షన్ ముఖ్యం అన్న ఉద్దేశ్యంతో, ఆర్థికంగా తమకేవీ ఇబ్బందులు లేవన్నకారణంతో రమణి ఉద్యోగం చేస్తానంటే వద్దన్నాడు. అలాగని ఆమె స్వేచ్ఛకి తనెప్పుడూ ప్రతిబంధకం కాలేదు. ఆమె ఇష్టాలనీ, యాక్టివిటీస్‌ని తనెప్పుడూ నిరోధించలేదు. కానీ పిల్లల్ని అందులోనూ ఆడపిల్ల దివ్యని నిర్లక్ష్యం చేస్తే భరించలేక పోతున్నాడు.

''అదేమన్నా చిన్నపిల్లా! పొద్దంతా కనిపెట్టుకుని కూర్చోడానికి. పదహారేళ్ళు వచ్చాయి. తన పని తను చేసుకుని, హాయిగా చదువుకోవచ్చు... ఇంట్లో కావల్సినంత ఏకాంతం. చదువుకోవటానికి ఇంతకన్నా మంచి వాతావరణం దొరుకుతుందా?'' అంటుంది.

''ఏకాంతం వేరు ఒంటరితనం వేరు. ఇంట్లో ఒంటరిగా ఉంటే పిచ్చెక్కదూ! కొంచెంసేపన్నా దానితో, గడపొచ్చుగా'' చరణ్ వాదనతో ఏకీభవించని రమణి నిర్లక్ష్యంగా అంటుంది.

''ఒంటరితనం నుంచి మేధావులు తయారయ్యారు. అది మేధావి కావాలంటే ఒంటరితనానికి అలవాటు పడాలి''.

''ఒంటరితనం నుంచీ మేధావులేం ఖర్మ, శాడిస్టులూ, పిచ్చివాళ్ళు కూడా తయారవుతారు.''

''చాల్లెండి. ప్రతిదానికి నన్ను విమర్శించడం అలవాటైపోయింది. అంత, బాధ, సానుభూతి ఉంటే మీరు సెలవు పెట్టి దాని దగ్గర కూర్చోండి. తండ్రిగా మీకు మాత్రం పిల్లల బాధ్యత లేదా?''

''తండ్రి మగపిల్లవాడిపట్ల, తల్లి ఆడపిల్లపట్ల శ్రద్ధ వహించాలి. మన రాహుల్‌కి కూడా ఈ మధ్య ఫ్రెండ్స్, సినిమాలు, షికార్లు ఎక్కువయ్యాయి. ఐ మస్ట్ కంట్రోల్ హిమ్.''

చరణ్‌కి సడన్‌గా రాహుల్ గుర్తురావడంతో ఆలోచనలనుంచి బైటపడి

చుట్టూ చూస్తూ అన్నాడు.

''రాహుల్ ఇంకా ఇంటికే రాలేదు. వీడెక్కడికెళ్ళినట్లు! చూశావా రమా! నీతో పాటు ఆ మీటింగ్‌కి రావడంతో టైమెంత వేస్టయిందో రేపట్నుంచీ నువ్వెళ్ళు నన్ను మాత్రం నీతో రమ్మని అడక్కు'' కొంచెం కోపంగా అనేసి వెళ్ళిపోయాడు.

రమణికి ఒళ్ళు మండిపోయింది.

''పెద్ద ఈయనకొక్కడికే బాధ్యతలున్నట్టు. పిల్లలు పెద్ద వాళ్లవుతున్నారు. వాళ్ళ జీవితం వాళ్ళది. అస్తమానం చిన్న పిల్లల్ని కనిపెట్టినట్టు కనిపెడ్తే ఎలా? అంత టైమ్ ఎవరికుంది? ఏమిటో! చాదస్తం చెబితే అర్థం కాదు'' రమణి బట్టలు మార్చుకోవడానికి లోపలికెళ్ళి పోయింది.

★ ★ ★

సమయం ఉదయం 7.30.

వంటింట్లో వంటతో కుస్తీ పడుతోంది రమణి. పచ్చడి చేయాలంటే గ్రైండర్ పాడయిపోయింది. రోట్లో వేసి నూరడం అలవాటు తప్పిపోయి చాలా ఇబ్బందిగా ఉంది.

''దివ్యా! దివ్యా!'' గట్టిగా కేకేసింది.

దివ్య నుంచి జవాబు రాలేదు.

స్టవ్ మీద పాలు పొంగిపోతున్నాయి. సవ్యసాచిలా రెండుచేతుల్తో పనిచేసినా తెమలదు. దేవుడు ఆడవాళ్ళకు నాలుగు చేతులిస్తే ఎంత బాగుండేది! అనుకుంటూ మళ్ళీ కేకేసింది.

''దొడ్లో మొక్కల దగ్గర కూర్చుందమ్మా!'' బ్రష్ నోట్లో పెట్టుకుని అన్నాడు రాహుల్.

'' ఇదో భావకురాలు. దీని ప్రపంచం మూడు విషయాలు చుట్టూ అల్లుకుపోయి ఉంది. స్కూలు, చదువు, టి.వి. మొక్కలు. నా ఖర్మ పదహారేళ్ళొచ్చాయి. నాక్కాస్త సాయం చేయచ్చుగా!''

'' ఏం చేస్తుంది మరి! దానితో మనసు విప్పి ఎవరన్నా మాట్లాడే వాళ్ళుంటే సరదాగా నాలుగు కబుర్లు చెప్తుంది. ఒంటరిగా వదిలేస్తే మౌనంగా మొక్కలతోటి, పక్షులతోటి మాట్లాడుకోవాల్సిందేగా!'' చరణ్ అన్నాడు.

''మీరు మళ్ళీ మొదలెట్టారా? పొద్దునే మీతో వాదన వేసుకునే టైమ్

నాకు లేదు. పనిమనిషి రాలేదు. ఛస్తున్నాను పనవక'' విసుగ్గా అంటూ పెరట్లోకి వెళ్ళింది.

పెరట్లో గన్నేరు చెట్టు దగ్గర నిలబడి తదేకంగా ఎటో చూస్తోంది దివ్య.

వర్షాకాలం కావడంతో ఆకాశం మబ్బు పట్టి ఉంది. చల్లగాలి వీస్తోంది. గాలికి అల్లరిగా దివ్య మొహంమీద ముంగురులు కదుల్తున్నాయి. దివ్య పెదాలమీద విరిసీ విరియని లేత మందహాసం. '' ఏం చేస్తోందబ్బా'' రమణి దివ్య వెనగ్గా వెళ్ళి చూసింది. రెండుకొమ్మల మధ్య చిన్నగూడు. పక్షి గూడు.

అలికిడికి వెనక్కి తిరిగి చూసిన దివ్య తల్లిని చూడగానే వికసించిన మొహంతో అన్నది ''అమ్మా! ఇలా చూడు పక్షి గూడెంత అందంగా ఉందో! అందులో చిన్నచిన్న గుడ్లు కూడా ఉన్నాయి.''

''పొద్దున్నే లేచి చిన్నపిల్లలా పక్షిగూడు చూస్తూ పక్షుల్తో ఆడుకుంటే ఎలా దివ్యా! కాలేజీకి టైం అవట్లేదూ! పద, పద కాస్త వంటలో సాయం చేద్దామని కూడా లేదు. రా త్వరగా'' దివ్య చేయిపట్టి వంటింట్లోకి లాక్కెళ్ళింది.

తన ఆనందాన్ని షేర్ చేసుకోకపోగా ఆ ఆనందం మీద నీళ్ళు చల్లిన రమణివైపు బాధగా, పక్షిగూటివైపు నిస్సహాయంగా చూస్తూ ఆవిడ వెంట వెళ్ళింది.

కొంచెం సేపటికి పనిమనిషి రావడంతో, దివ్య మామూలుగా తన పనులు చూసుకుని కాలేజీకి వెళ్ళింది. కానీ ఆమె మనసంతా పక్షిగూడు మీదేవుంది.

దాదాపు రెండు నెలలుగా రంగురంగుల పక్షి ఒకటి గన్నేరు చెట్టుమీద వాలి రోజూ ఉదయాన్నే మధురంగా కూస్తోంది. అప్పట్నించి ఆ పక్షికూత వినడం తన దినచర్యలో ఓ భాగమైంది. వారం క్రితం అందంగా గూడు కట్టుకుంది ఆ పక్షి. మరి ఎప్పుడు పెట్టిందో ఇవాళ ఉదయాన్నే చిన్న చిన్న గుడ్లు కనిపించాయి. అవి బుజ్జి బుజ్జి పక్షి పిల్లలుగా ఎప్పుడెప్పుడు మారతాయా అని దివ్య మనసు తహ తహలాడసాగింది.

రోజూ కాలేజీకి వెళ్ళేముందు, కాలేజీ నుంచి రాగానే ఆ గుడ్లు పిల్లలుగా మారాయా, లేదా అని చూడటం, తరువాత మిగతా పనులు చేయడం.

ఆ పక్షి గురించి, అది అల్లిన అందమైన గూడు గురించి ఆ గుడ్ల గురించి, అవి మారబోయే పిల్లల గురించి తన మనసులో కలిగే అనుభూతిని ఎవరితోనైనా పంచుకోవాలని ఉంది దివ్యకి.

అమ్మ వినదు. విన్నా ఆ విషయం ఆవిడ అంత సీరియస్‌గా తీసుకోదు. ఆవిడ కార్యకలాపాల్లో ఇలాంటి చిన్న చిన్న విషయాలు మనసుకి తాకవు.

ఇక నాన్న, ఆయన ఎప్పుడో తప్ప రోజూ పది దాటాకే ఇంటికి వస్తాడు.

మిగిలింది రాహుల్. వాడికి క్రికెట్ మ్యాచ్, హిందీ సినిమాలు తప్ప మరో ప్రపంచం లేదు.

తన ఫ్రెండ్స్ అందరికీ కూడా సినిమాలు, పార్టీలు, ట్రీట్‌లు. మా మమ్మీతో అక్కడికెళ్ళాం, ఇక్కడికెళ్ళాం, డ్రస్ కొనుక్కున్నాం, వగైరా తప్ప మరేం మాట్లాడరు. ఎలా? ఇంకెవరితో పంచుకోవాలి తన అనుభూతి!

''అలా వున్నావేం దివ్యా! క్లాసకిరావా?'' టిఫిన్ తినడం ముగించి దిగాలుగా ఆలోచిస్తూ కూర్చున్న దివ్యని పలకరించాడు క్లాస్‌మేట్ సాకేత్.

దివ్య ఉలిక్కిపడి లేచింది. '' ఆ... ఆ వస్తున్నాను'' అంటూ బాక్స్ చేతిలోకి తీసుకుంది.

''నువ్వెప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటావేంటి?'' కుతూహలంగా చూశాడు సాకేత్.

దివ్య నవ్వి వూరుకుంది.

''నీకు ఫ్రెండ్స్‌తో సరదాగా గడపడం ఇష్టంలేదా? ఏదో పోగొట్టుకున్నట్టుంటావు'' సాకేత్ అలా ఆప్యాయంగా తరచి తరచి అడుగుతుంటే దివ్యకి చాలా హాయిగా అనిపించింది.

తన ఒంటరితనాన్ని పోగొట్టడానికి-- తన అనుభూతుల్ని పంచుకోవడానికి-- తన భావాలను వెల్లడించటానికి ఓ తోడు దొరికినట్లైంది. ఆ కాస్త సానుభూతినీ, ఊరడింపునీ సాదరంగా ఆహ్వానించింది.

చాలా తక్కువ వ్యవధిలో సాకేత్‌కి సన్నిహితురాలైంది. ఇప్పుడు దివ్యని రమణి ఆబ్సెన్స్ అంతగా బాధించటంలేదు. ఇదివరకులా కాలేజీ అయిపోగానే ఇంటికెళ్ళి టి.వి.నో, మొక్కల్నో ఆశ్రయించాల్సిన అవసరం తప్పిపోయింది. సాకేత్‌తో కలిసి కాలేజీ ప్రక్కనే ఉన్న 'ఛాట్ భండార్'లో కూర్చొని కట్లెట్, సమోసా, గప్‌చిప్‌లు తింటూ కబుర్లు చెప్తోంది... హాయిగా వుంది... మనసు

ఉల్లాసంగా మారింది.

దివ్యలో మునుపటి స్తబ్దతపోయి, చలాకితనం చోటుచేసుకోవడం కేవలం చరణ్ మాత్రమే గమనించాడు. కారణం అర్థం కాలేదు. అయినా ఆ విషయం అంత సీరియస్‌గా తీసుకోలేదతను. దివ్య మొహంలో ఓ వింత అందం, మెరుపు కనిపించి ఆ మార్పుకి అతనెంతో ఆనందించాడు.

వారం పది రోజుల్లో గన్నేరు చెట్టుమీద పక్షి తన గుడ్లను పొదిగింది. బుజ్జి బుజ్జి పక్షి పిల్లల్ని చూసి కేరింతలు వేయాలనిపించింది దివ్యకి. రోజూ వాటి డెవలప్‌మెంట్స్ సాకేత్‌కి చెబ్తోంది.

తను దగ్గరకు వెళ్ళగానే తల్లి పక్షి తన రెక్కలమధ్య పిల్లల్ని దాచి కాపలా కాయడం చాలా తమాషా అనుభూతిని కలిగించింది. తన పిల్లల్ని ఎవరన్నా ఎత్తుకుపోతారన్న భయంతో తల్లి పక్షి అనుక్షణం వాటిని కాపలా కాస్తుంటే దానిని కవ్వించడం దివ్యకి సరదాగా అన్పించసాగింది. ఆ పక్షి పిల్లల్ని చూడటానికి ఇంటికి వస్తానన్నాడు సాకేత్. ''అమ్మ లేనప్పుడు చెబ్తాను. అలాగే వద్దువు గానిలే'' అన్నది దివ్య.

రమణి మహిళామండలి వార్షికోత్సవాలతో తలమునకలుగా ఉంది. వంట మాత్రం చేసేసి మహిళామండలికి వెళ్ళడం, అక్కడి వారోత్సవాల ఏర్పాటు చేయడం ఏ రాత్రి తొమ్మిదింటికో ఇల్లు చేరడం, అలసిపోయి నిద్రపోవడం.

ఆ ఇంట్లో పదిపదిహేను రోజుల్నించీ భార్యభర్తల మధ్యా, తల్లీపిల్లల మధ్యా కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడింది. ఆ గ్యాప్ కేవలం చరణ్‌ని మాత్రమే ఎక్కువగా బాధించింది. ఏదో పెద్ద అఘాధం ఏర్పడినట్టు అనీజీగా ఫీలయ్యాడు. కానీ, తన బాధ మాత్రం భార్యముందు వ్యక్తం చేయలేకపోయాడు. కారణం అతనికి తెలుసు. రమణికి ఇలాంటివి ఎంత చెప్పినా అర్థంకావు. అర్థం చేసుకోవటానికి ప్రయత్నించదు. ఇద్దరిమధ్యా వాదన తప్ప మరే ప్రయోజనం ఉండదు. అందుకే అతను బాధను నిశ్శబ్దంగా భరించటానికి ప్రయత్నించసాగాడు.

ఆ రోజు...

రమణి ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో నుంచి దివ్య నవ్వు కిలకిలా విన్పిస్తోంది. ఎప్పుడూ లేనిది దివ్య అంతలా నవ్వడం రమణి ఆశ్చర్య పోయింది. ఆ ఆనందానికి ఏవిటబ్బా కారణం? అనుకుంటూ లోపలికి

అడుగుపెట్టిన రమణి ప్రాన్పడిపోయింది.

దివ్య చేతిలో టెడ్డీబేర్ ఉంది. అది అందుకోవటానికి ప్రయత్నిస్తున్నాడో కుర్రాడు. అతనికి అందకుండా చేయి ఎత్తి పట్టుకుంది దివ్య. ఆ చేతిక్రింద చక్కలి గిలి పెడుతున్నాడు ఆ కుర్రాడు. ఎంతో సన్నిహితంగా వీళ్ళిద్దర్నీ చూసిన రమణికి కోపమో! సంభ్రమమో తెలీని ఓ భావంతో నోట మాట రాలేదు.

రమణిని చూడగానే దివ్య నవ్వాపేసి తలవంచుకుంది భయంతో. ఆ కుర్రాడు చటుక్కున అక్కడ్నించి లేచి బైటికి పారిపోయాడు.

రమణి చాలాసేపు అలా నిలబడిపోయి, ఏమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. తను చూసిన ఆ సంఘటనని ఎలా నిర్వచించాలో ఎలా అన్వయించుకోవాలో అర్థం కాలేదు ఆమెకి.

దివ్యకి పరాయి మగపిల్లవాడితో అంత క్లోజ్‌నెస్ ఎలా ఏర్పడింది? ఎంతకాలం నుంచీ వీళ్ళ స్నేహం? ఎంత దూరం ఆ స్నేహం? అసలెలా జరిగిందిలా? ఆవిడకి పిచ్చెక్కిపోయింది.

దివ్య ఇలా మారడానికి కారణం తనేనా! తనేనా! చరణ్ అస్తమానం 'దివ్యకి ఈ వయసులో నీ పర్సనల్ అటెన్షన్ ముఖ్యం రమా!' అని తనని హెచ్చరించేది ఇందుకేనా?

రమణికి తల తిరిగిపోతోంది. పడుకోబుద్ధి కాలేదు. కూర్చోవాలనిపించలేదు. దివ్య నిశ్శబ్దంగా తన గదిలో చదువుకుంటోంది.

ఎలాగోలా వంట పూర్తి చేసింది.

తొమ్మిదింటికి చరణ్ వచ్చాడు. అతనితోటే రాహుల్ కూడా వచ్చేశాడు. అన్యమనస్కంగా భోజనాలు కానిచ్చారందరూ. నలుగురూ కలిసి ఉన్నా వాళ్ళ మధ్య మాత్రం ఏదో దూరం. ఏదో వెలితి.

ఆ రాత్రి చరణ్ గుండెలమీద వాలిపోయి వెక్కివెక్కి ఏడ్చింది రమణి.

అతను నిశ్చేష్టుడయ్యాడు.

ఎప్పుడూ కస్సుబుస్సులాడే భార్య అంతలా ఎందుకేడుస్తోందో అర్థం కాలేదు. ఎంత బుజ్జగించి అడిగినా రమణి చెప్పలేదు. చెబితే తనని తిడతాడని, ''కనీసం చూశావా, నేను చెబితే వినలేదు అనుభవించు'' అని వెటకారం చేస్తాడని అనిపించింది.

ఎప్పటికో నిద్ర పట్టింది ఇద్దరికీ కూడా.

లేచేటప్పటికి బాగా తెల్లవారిపోయింది.

రమణి లేచి పెరట్లోకి వెళ్ళింది. ఇవాళ ఆమె దినచర్య రోజులా వేగంగా ప్రారంభం అవలేదు. నింపాదిగా ఒక్కో మొక్కా పరిశీలిస్తూ, రాత్రి తను ఎదుర్కొన్న సమస్యకి పరిష్కారం ఆలోచిస్తూ తిరగసాగింది.

గన్నేరు చెట్టు కొమ్మల్లో చిక్కుకున్న గూడులోని తల్లిపక్షి రమణిని చూసి తన రెక్కలు అడ్డం పెట్టి పిల్లల్ని ఆ రెక్కల క్రింద పొదువుకుంది. కుతూహలంగా ఆ పక్షివైపు కదిలింది రమణి. రమణి దగ్గరికి రాగానే భయంతో వింత వింత శబ్దాలు చేయసాగింది తల్లిపక్షి.

రమణి గూడులోకి తొంగిచూడ బోయింది. పక్షి పిల్లలు కనిపించలేదు. తల్లి రెక్కలక్రింద ఒదిగి వున్నాయి.

రమణికి ఆ సన్నివేశం ఎంతో అపురూపంగా, అద్భుతంగా కనిపించింది. ఏదో ఓ దివ్యశక్తి తనకేదో సందేశాన్ని ఇస్తున్నట్టు అనిపించింది.

ఎంత భయం ఆ పక్షికి! తన పిల్లల్ని ఎవరన్నా ఎత్తుకెళ్ళిపోతారని. ఎంత అపురూపంగా, జాగ్రత్తగా తన రెక్కల క్రింద దాచుకుంది! వాటికి రెక్కలొచ్చి స్వయంగా ఎగరగలిగిందాకా వాటిని కాపాడటం ఆ తల్లి పక్షి బాధ్యత. తన బాధ్యతని ఎంత చక్కగా సమర్థవంతంగా నిర్వహిస్తోంది.

ఓహ్, నిజంగా మనిషి శోధించాలే గానీ ఈ ప్రకృతిలోని ప్రతి సృష్టిలోనూ మానవుడి మనుగడని క్రమశిక్షణతో తీర్చిదిద్దుకోవడానికి కావలసిన సందేశం గోచరిస్తుంది. కాకపోతే కొంత పరిశీలన అవసరం.

రమణికి మనసంతా హాయిగా ఉషోదయంలో విచ్చుకున్న గులాబీలా స్వచ్ఛంగా మారినట్టనిపించింది.

దివ్య అలా మారడానికి తను పరోక్షంగా ఏ విధంగా బాధ్యురాలో అవగతం అయింది.

ఉల్లాసంగా లోపలికెళ్ళి ''దివ్యా! దివ్యా! లేమ్మా! పొద్దుగూకుతోంది'' అని ఆప్యాయంగా కూతుర్ని లేపింది.

•

ఆంధ్రప్రభ 'మహిళ' ప్రచురితం